ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY


5



చిత్తూరు
జిల్లా వార్తలు

సోమవారం 3 మార్చి 2025

ప్రధానమంత్రి సూర్యఘర్ పథకం కింద మీ ఇంటిపై సోలార్ విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు చేసుకుంటే కరెంటు బిల్లు తగ్గుతుంది. ఒకసారి సోలార్ ప్యానళ్లు ఏర్పాటు చేసుకుంటే 25 ఏళ్లపాటు పనిచేస్తాయి. ప్లాంటు ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ కూడా ఇస్తుంది. ప్రధానంగా ఈ ప్లాంటు వల్ల పర్యావరణానికీ మేలు చేసిన వారవుతారు. ఈ విషయాలపై గృహ వినియోగదారులకు విద్యుత్‌శాఖ అధికారులు అవగాహన కల్పిస్తూనే ఉన్నారు. అయినా జనం మాత్రం ఆసక్తి చూపడం లేదు. జిల్లాలో ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా ఈ ప్లాంట్లు ఏర్పాటు చేయనుండటంతో ఆయా వర్గాల సర్వీసుల రిజిస్ట్రేషన్లు మాత్రమే కనిపిస్తున్నాయి.



వినియోగదారులు పొందే లబ్ధి వివరాలు..

సామర్థ్యం కిలోవాట్	ఉత్పత్తయ్యే యూనిట్లు	గతంలో వస్తున్న బిల్లు (రూపాయల్లో)	సోలార్‌ప్యానల్ అమర్చాక బిల్లు (రూపాయల్లో)	ఏడాదికి ఆదా (రూపాయల్లో)	రాయితీ
1	120	1000	338	8000	30,000
2	240	2000	333	20,000	60,000
3	360	3000	293	32,400	78,000

- చిత్తూరు రూరల్, ఆంధ్రజ్యోతి

కేంద్ర ప్రభుత్వం గత ఏడాది ఫిబ్రవరిలో ప్రధాన మంత్రి సూర్యఘర్ పథకాన్ని ప్రారంభించింది. ఈ పథకం కింద ఇళ్ల పైన సోలార్ ప్యానళ్లు ఏర్పాటు చేసుకుని విద్యుత్ ఉత్పత్తి చేసుకోవచ్చు. సోలార్ ప్యానళ్లు, ఇతర సామగ్రికి అయ్యే వ్యయంలో దాదాపు సగం మొత్తాన్ని కేంద్ర ప్రభుత్వం రాయితీగా ఇస్తుంది. వినియోగదారుడు పదిశాతం చెల్లిస్తే.. మిగిలిన సొమ్మును కూడా బ్యాంకు నుంచి రుణంగా తీసుకునే వెసులుబాటు ఉంది.

'సూర్యఘర్‌పై' అనాసక్తి



కుప్పం మండలం నడిమూరు గ్రామంలోని ఇళ్లపై అమర్చిన సోలార్ ప్యానళ్లు

- సోలార్ విద్యుత్ ప్లాంటు ఏర్పాటుకు ముందురాని జనం
- కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ ఇస్తున్నా స్పందన అంతంతే

ఇప్పటి వరకు జరిగిన రిజిస్ట్రేషన్లు

జిల్లాలో అన్ని సర్వీసులు కలిపి 4,36,446 ఉన్నాయి. వీటిల్లో ఎస్సీ, ఎస్టీల సర్వీసులు 84429 ఉండగా, ఇప్పటి వరకు ఈ పథకానికి 43వేల సర్వీసులకు రిజిస్ట్రేషన్లు చేయించారు. ఇతరులైతే కేవలం 2,150 మంది మాత్రమే రిజిస్ట్రేషన్లు చేసుకున్నారు. 212 మంది మాత్రమే డబ్బులు చెల్లించగా, 188 మంది ఇళ్ల సోలార్ విద్యుత్ ప్లాంటు ఏర్పాటైంది. మిగిలిన 24 మంది ఇళ్లపై పనులు జరుగుతున్నాయి.

కుప్పంలో అందరికీ ఉచితం

రాష్ట్రం మొత్తం సోలార్ విద్యుత్ ప్లాంట్లు ఏర్పాటు చేయాలన్నది ముఖ్యమంత్రి చంద్రబాబు ఆకాంక్ష. ఇందుకోసం పైలట్ ప్రాజెక్టు కింద తాను ప్రాతినిథ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గాన్ని ఎంపిక చేశారు. ఇక్కడ కులంతో సంబంధం లేకుండా పీఎం సూర్యఘర్ కింద అన్ని గృహ సర్వీసులకు ఉచితంగా సోలార్ ప్యానళ్లు ఏర్పాటు చేస్తున్నారు. నియోజకవర్గంలో మొత్తం 77వేల సర్వీసులుంటే 57వేల సర్వీసులకు ఈ పథకానికి అర్హులుగా తేల్చారు. మిగిలినవి గుడిసెలు, రెండు, అంతకన్నా ఎక్కువ అంతస్తులు ఉన్న భవనాలను ఒకే సర్వీసుగా గుర్తించారు. ప్రస్తుతం కుప్పం మండలంలోని నడిమూరు గ్రామంలో సోలార్ విద్యుత్ పాంట్లు ఏర్పాటు చేస్తున్నారు. ఈ గ్రామంలో 102 సర్వీసులుంటే అందులో 84 సర్వీసులకు సోలార్ ప్యానళ్లను అమర్చినట్లు అధికారులు తెలిపారు.

25 ఏళ్లపాటు ప్యానళ్లు పనిచేస్తాయి



విద్యుత్తు డిమాండ్ పెరుగుతుండటంతో చార్జీల భారం మోయక తప్పని పరిస్థితి. దీనికి ప్రత్యామ్నాయమే సోలార్ విద్యుత్తు. ఒక్కసారి పెట్టుబడి పెడితే 25 ఏళ్లపాటు సోలార్ ప్యానళ్ల పనిచేస్తాయి. వీటి ద్వారా ఉత్పతయ్యే విద్యుత్‌ను వాడుకొని మిగిలింది విద్యుత్తు శాఖకే విక్రయించవచ్చు. కేంద్ర ప్రభుత్వం రాయితీ ఇస్తుండటంతో అందరూ సద్వినియోగం చేసుకోవాలి.

- ఇస్మాయిల్ అహ్మద్, విద్యుత్ శాఖ ఎస్ఈ

మూడు కేటగిరీలు

ఈ పథకంలో వినియోగదారులను మూడు కేటగిరీలుగా విభజించారు. ఏ కేటగిరీలోని వారు ఎన్ని కిలోవాట్ల ప్యానళ్ల ఏర్పాటు చేసుకోవాలన్నది తెలియజేశారు.

- నెలకు 120 యూనిట్లు వాడేవారు ఒక కిలోవాట్ సోలార్ ప్యానళ్లను ఏర్పాటు చేసుకోవచ్చు. రూ.60వేల ఖర్చయితే.. రాయితీ రూ.30వేలు వస్తుంది.
- నెలకు 240 యూనిట్లు వాడేవారు రెండు కిలోవాట్ల సోలార్ ప్యానళ్ల ఏర్పాటు చేసుకోవచ్చు. రూ.1.20 లక్షల ఖర్చయితే, రాయితీ రూ.60వేలు వస్తుంది.
- నెలకు 360 యూనిట్లు వాడేవారు మూడు కిలోవాట్ ప్యానళ్లను ఏర్పాటు చేసుకోవచ్చు. రూ.1.80లక్షల ఖర్చయితే, రాయితీ రూ.78వేలు వస్తుంది.

ఉదాహరణకు..

మూడు కిలోవాట్ల సోలార్ యూనిట్ ధర రూ.1.80 లక్షలు. ఇందులో లబ్ధిదారుడు తొలుత 10 శాతం అంటే రూ.18వేలను జమ చేస్తే..మిగిలిన రూ.1.62 లక్షలు బ్యాంకు రుణం మంజూరవుతుంది. ప్లాంటు ఏర్పాటు చేసిన రెండు నెలల తర్వాత కేంద్ర ప్రభుత్వం రాయితీ సొమ్ము రూ.78వేలను లబ్ధిదారుడి ఖాతాలో జమ చేస్తుంది. ఈ సొమ్మును బ్యాంకు రుణానికి జమ చేస్తే అసలు, వడ్డీ భారం తగ్గుతుంది.

విద్యుత్ ఉత్పత్తి ఇలా..

ఇంటి శ్లాబ్‌పై 100 చదరపు అడుగుల స్థలంలో ఒక కిలోవాట్ సోలార్ ప్యానళ్లు అమర్చుకోవచ్చు. ఒక కిలో వాట్ సోలార్ ప్యానళ్ల ద్వారా రోజుకు నాలుగు చొప్పున నెలకు 120 యూనిట్లు విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. రెండు కిలోవాట్లకు రోజుకు 8 చొప్పున నెలకు 240 యూనిట్లు, 3 కిలోవాట్‌కు రోజు కు 12చొప్పున నెలకు 360 యూని ట్లు విద్యుత్ ఉత్పత్తి అవుతుంది.

యూనిట్‌కు రూ.2.09 ఇస్తారు

ప్రస్తుతం మన ఇంట్లో మీటరు స్థానంలో నెట్ మీటరు పెడతారు. సోలార్ ద్వారా ఉత్పత్తి అయ్యే యూనిట్ల రీడింగ్, వినియోగదారుడు వాడుతున్న యూనిట్ల రీడింగ్ కూడా ఈ మీటరులో స్పష్టంగా నమోదవుతుంది. దీనిద్వారా మన గృహ అవసరాలకుపోను సోలార్ ద్వారా ఉత్పత్తి అయిన కరెంటును విద్యుత్ శాఖ తీసుకుంటే ఒక్కో యూనిట్‌కు లబ్ధిదారుడికి రూ.2.09 చొప్పున చెల్లిస్తుంది. ఈ మొత్తం నెలాఖరులో లెక్కించి లబ్ధిదారుడికి బ్యాంకు ఖాతాలో జమచేస్తారు.

ఎస్సీ, ఎస్టీలకు అదనపు లబ్ధి

ఎస్సీ, ఎస్టీలు తమ ఇళ్లపై సోలార్ ప్యానళ్ల పెట్టుకున్నందుకు ఒక్కో చదరపు అడుగుకు ప్రతినెలా రూ.2 చొప్పున చెల్లిస్తారు. ఉదాహరణకు ఒక కిలోవాట్ సోలార్ ప్యానళ్ల పెట్టుకోవడానికి 100 చదరపు అడుగుల స్థలం కావాలి గనుక ప్రతినెలా రూ.200 వరకు అదనంగా లబ్ధి చేకూరనుంది.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (సోమవారం) : 6.27

సహరి (మంగళవారం) : 5.06

కలెక్టరేట్‌లో నేడు 'పీజీఆర్ఎస్'

చితూరు అర్బన్, మార్చి2 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం జరుగుతుందని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంటవరకు జరిగే ఈ కార్యక్రమంలో ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరిస్తామన్నారు. మండల, నియోజకవర్గాల్లో కూడా ఈకార్యక్రమాన్ని నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.

జిల్లా పోలీసు కార్యాలయంలోనూ..

జిల్లా పోలీసు కార్యాలయంలోనూ పీజీఆర్ఎస్ జరుగుతుందని ఎస్పీ మణికంఠ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు వినతి పత్రాలను స్వీకరిస్తామన్నారు.

మళ్లీ మొదలైన గజదాడులు

- ధ్వంసమవుతున్న పంటలు
- ఆందోళనలో పులిచెర్ల, సోమల మండలాల రైతులు



ఆవులపల్లె వద్ద తొక్కేసిన టమోటా పంట - పులిచెర్ల మండలంలో ధ్వంసమైన వరి

కల్లూరు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): రైతులు ఊపిరి పీల్చుకునేలోపే మళ్లీ పులిచెర్ల మండలంలోని పంటలపై ఏనుగుల గుంపు దాడులు చేస్తున్నాయి. పులిచెర్ల మండలం కావేటిగారిపల్లె, ఎల్లంకివారిపల్లె కల్లూరు, పాళెం, పాతపేట తదితర పంచాయతీల్లో రెండ్రోజుల కిందట ఏనుగులు పంటలను ధ్వంసం చేసి.. అడవి వైపు వెళ్లిపోయాయి. శనివారం రాత్రి పుణ్యంచెరువు సమీపంలోని అడవి నుంచి ఎల్లంకివారిపల్లె పంచాయతీ దిగుమూర్తివారిపల్లె సమీపానికి ఏనుగుల గుంపు వచ్చి.. వరి, మామిడి, అరటి పంటలను ధ్వంసం చేశాయి. దిగుమూర్తివారిపల్లెలోని జయచంద్రనాయుడికి చెందిన ఎకరా వరిపంట, అరటి, కొబ్బరి, పశుగ్రాసంతోపాటు మోటరు పైపులను ధ్వంసం చేశాయి. ఆదికేశవులునాయుడు, సురేంద్ర, గోపినాయుడు, చెంగల్రాయనాయుడికి చెందిన పలు పంటలను తొక్కి నాశనం చేశాయని బాధితులు ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివారం ఉదయం ఎఫ్ఎస్‌వో మహమ్మద్ షఫీ సంఘటనా ప్రాంతానికి చేరుకున్నారు. అడవిలోకి ఏనుగులు వెళ్లిన జాడను సిబ్బందితో కలిసి పరిశీలించారు.

సోమల: మండలం పేటూరు పంచాయతీలోని బోనమంద, పేటూరు గ్రామాల్లోనూ శనివారం రాత్రి ఏనుగుల పంటలను ధ్వంసం చేశాయి. బోనమందలోని చంద్రశేఖర్, రాధయ్య, భాస్కర్, శ్రీనివాసులు, పేటూరుకు చెందిన మహేశ్వర్‌లకు చెందిన వరి, టమోటా, మామిడి పంటలను ధ్వంసం చేశాయి. పత్రపల్లె, కొత్తూరు, రామకృష్ణాపురం తదితర ప్రాంతాల్లో ఏనుగులు సంచరిస్తున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వరసిద్ధుడి దర్శనానికి 3 గంటలు



ఐరాల(కాణిపాకం), మార్చి 2 (ఆంధ్రజ్యోతి): కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి దర్శనానికి మూడు గంటల సమయం పట్టింది. ఆదివారం జిల్లా నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు. క్యూలైన్లు పూర్తిగా నిండిపోయాయి. క్యూలైన్లలోని భక్తుల దాహార్తిని తీర్చడానికి ఆలయ సిబ్బంది తాగునీటిని అందించారు.



రథంపై ఊరేగుతున్న ఆది దంపతులు

వైభవంగా మొగిలీశ్వరుడి రథోత్సవం

బంగారుపాళ్యం, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): బంగారుపాళ్యం మండలంలోని మొగిలి గ్రామంలోని స్వయంభు కామాక్షి సమేత మొగిలీశ్వర స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఆది దంపతులైన పార్వతీపరమేశ్వరుల రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఉదయం మూలవిరాట్లకు పూజలు, అభిషేకాలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు గంగాధర గురుకల్ ఆధ్వర్యంలో సాయంత్రం ఆరు గంటలకు అలంకార మండపంలో స్వామి, అమ్మవారి ఉత్సవర్లను సుందరంగా అలంకరించి, రథంపై అధిష్ఠింపజేశారు. భజన బృందం కీర్తనలు, భక్తుల జయజయధ్వనాల మధ్య రథం ముందుకు సాగింది. భక్తులు రథంపైకి బొరుగులు, మిరియాలు చల్లి మొక్కులు చెల్లించారు. తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలతోపాటు ఉమ్మడి చిత్తూరు జిల్లా నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. మొగిలి ఆలయ పరిసరాలు శివ నామ స్మరణతో మార్మోగాయి. ఉభయదారులుగా బెంగళూరుకు చెందిన ఆక్స్‌ఫర్డ్ డెంటల్ కళాశాల యాజమాన్యం రమేష్‌రాజు కుటుంబీకులు వ్యవహరించారు. ఆలయం, రథోత్సవానికి పలమనేరుకు చెందిన మోహన్‌రెడ్డి కుటుంబీకులు పుష్పాలంకరణ చేశారు. భక్తులు సౌకర్యార్థం ఈశ్వర్ కళ్యాణ్ అభయ ట్రస్టు వారు బంగారుపాళ్యం, పలమనేరు మధ్య బస్సు సర్వీసులు ఉచితంగా నడిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పలమనేరు డీఎస్పీ ప్రభాకర్, బంగారుపాళ్యం సీఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాట్లు చేశారు.

బ్రహ్మోత్సవాల్లో నేడు

సోమవారం రాత్రి పుష్పపల్లకి సేవ జరగనుంది.



- జిల్లాలోని 12 మండలాల్లో ఇన్‌చార్జిలతో నెట్టుకొస్తున్నారు
- దీనివల్లే రీసర్వే, రెవెన్యూ సదస్సుల అర్జీల పరిష్కారంలో జిల్లా చివరిస్థానం

తహసీల్దార్లు కావలెను!

చిత్తూరు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): రీసర్వే గ్రామ సభల్లో, రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీల పరిష్కారంలో రాష్ట్రంలోని మిగిలిన జిల్లాలతో పోల్చుకుంటే మన జిల్లా చివర్లో ఉంది. అలాగే ఆయా మండలాల్లో వినతులిచ్చే ప్రజలకూ సత్వర న్యాయం జరగడం లేదు. ఒకట్రెండు కాదు.. ఏకంగా 12 మండలాల్లో ఇన్‌చార్జి తహసీల్దార్లుగా డిప్యూటీ తహసీల్దార్లు పనిచేస్తున్నారు. అంటే డిప్యూటీ తహసీల్దార్ బాధ్యతలు చూడడంతోపాటు తహసీల్దార్ పని కూడా చేయాలి. ఒకరే రెండు పోస్టుల్లో ఉండడంతో అనేకరకాల ఇబ్బందులు ఎదురవుతున్నాయి. సాధారణ పరిస్థితుల్లో అయితే.. ఒకరు క్షేత్రస్థాయి పరిశీలనకు వెళితే.. కార్యాలయంలో మరొకరు ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారు.

ఈ 12 మండలాల్లో డిప్యూటీ తహసీల్దార్లే..

జిల్లాలో 31 మండలాలుండగా.. 12 చోట్ల డిప్యూటీ తహసీల్దార్లే ఇన్‌చార్జిలుగా ఉన్నారు. విజయపురం- కిరణ్, గుడిపాల- జయంతి, తవణంపల్లె- సుధాకర్, ఐరాల- మహేష్‌కుమార్, రొంపిచెర్ల- కిరణ్‌కుమార్, పులిచెర్ల- జయసింహ, సదుం- హుస్సేన్, వెదురుకుప్పం- రమేష్‌బాబు, ఎస్ఆర్‌పురం- లోకనాథంపిళ్లై, పెనుమూరు- శ్రావణ్‌కుమార్, యాదమరి- పార్థసారథి, పెద్దపంజాణి- అనిల్‌కుమార్‌లు రెగ్యులర్ డీటీలు అయినా.. ఇన్‌చార్జి తహసీల్దార్లుగా పనిచేస్తున్నారు.

జూనియర్లు కూడా ఇన్‌చార్జిలుగా..

డిప్యూటీ తహసీల్దార్ల ప్రమోషన్ జాబితా కోర్టు కేసులతో ఆగిపోయింది. కేసు క్లియర్ అయితే డీటీలు చాలావరకు తహసీల్దార్లుగా పదోన్నతులు పొందుతారు. ఆ కేసు క్లియర్ అయితే జిల్లాకు తహసీల్దార్ల కొరత దాదాపుగా తీరుపోతుంది. ప్రమోషన్ లిస్టులో పేరున్న డీటీలను ఇన్‌చార్జిలుగా నియమిస్తే పర్వాలేదు కానీ, కొన్ని మండలాల్లో మోస్ట్ జూనియర్లను కూడా ఇన్‌చార్జిలుగా నియమించడం చర్చనీయాంశంగా మారింది.

ఒకరే రెండు మండలాల్లో..


గతేడాదిలో చివరి రోజు మద్యం తాగి ఓ వ్యక్తిని కొట్టిన ఘటనలో అప్పటి గంగవరం, పెద్దపంజాణి మండలాల ఇన్‌చార్జి తహసీల్దార్లు శివ, ప్రసన్నలు సస్పెండ్ అవ్వగా.. ప్రసన్నకు కుప్పం ఆర్డీవో కార్యాలయంలో వెంటనే పోస్టింగ్ ఇచ్చారు. శివ సస్పెన్షన్ మాత్రం కొనసాగుతోంది. దీంతో ఖాళీ అయిన పెద్దపంజాణి మండలానికి గంగవరం డీటీ అనిల్‌ను ఇన్‌చార్జి తహసీల్దార్‌గా నియమించారు. ఖాళీ అయిన మరో మండలం గంగవరంనకు బైరెడ్డిపల్లె తహసీల్దార్ మాధవరాజుకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు.

అర్జీల పరిష్కారంపై ప్రభావం..

గతేడాది అక్టోబరు,నవంబరు నెలల్లో జరిగిన రీసర్వే గ్రామ సభల్లో సుమారు 16వేల అర్జీలొస్తే పది రోజుల కిందటి వరకు 600అర్జీలు మాత్రమే పరిష్కారమయ్యాయి.ఆ తర్వాత రాష్ట్రంలో జిల్లా వెనుకంజలో ఉందని తెలిసి ఉన్నతాధికారులు వెంటబడితే ప్రస్తుతం 2700 అర్జీల వరకు పరిష్కారమయ్యాయి. చాలావరకు మళ్లీ రీఓపెన్ చేయాల్సి వస్తోంది. అలాగే, గతేడాది డిసెంబరులో జిల్లా వ్యాప్తంగా రెవెన్యూ సదస్సులు నిర్వహించారు.ప్రజలనుంచి రెవెన్యూ సమస్యలపై 10,781అర్జీలు వచ్చాయి. వాటిలో 50 శాతం మాత్రమే పరిష్కరించారు. వెదురుకుప్పం, చిత్తూరు రూరల్, బంగారుపాళ్యం, బైరెడ్డిపల్లె, గంగవరం, పెద్దపంజాణి, పెనుమూరు, రొంపిచెర్ల మండలాల్లో అర్జీలు పెద్దఎత్తున పెండింగులో ఉన్నాయి.

ఇతర విధుల్లో ఆరుగురు తహసీల్దార్లు

చిత్తూరు పూర్వ తహసీల్దార్ మురళీమోహన్ అప్పట్లో వైసీపీ నేతలకు పెద్దఎత్తున అక్రమ పట్టాలను అందించారని ఉన్నతాధికారులు నిర్ధారించారు. దీంతో అతనికి ఎక్కడా పోస్టింగ్ ఇవ్వకుండా కలెక్టరేట్‌లోనే పని చేయించుకుంటున్నారు.అలాగే కుమారస్వామి, వాసుదేవన్ అనే సెక్షన్ ఇన్‌చార్జిలూ ఉన్నారు.ఈ ముగ్గురు కాకుండా కుప్పం,పలమనేరు, చిత్తూరు ఆర్డీవో కార్యాలయాల్లోనూ ఏవోలుగా తహసీల్దార్లే ఉన్నారు.వీరంతా ఆయా ప్రాంతాల్లో అవసరమని ఉన్నతాధికారులు భావించి నియమించారు.



గిరి ప్రదక్షిణ కోసం శ్రీకాళహస్తి పురవీధుల్లో సాగుతున్న స్వామి అమ్మవార్లు



రామాపురం రిజర్వాయరు వద్ద సేద తీరుతున్న భక్తులు

దేవతలారా.. వెళ్లి రండి



ఎదురుసేవ మండపం వద్ద స్వామి అమ్మవార్లు

కొండచుట్టుకు వెళుతూ వీడ్కోలు పలికిన ఆదిదంపతులు

కైలాసగిరుల చుట్టూ భక్తుల కోలాహలం

శ్రీకాళహస్తి, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం శివ పార్వతుల కొండ చుట్టు (గిరి ప్రదక్షిణ) వేడుకగా జరిగింది. ఈ సందర్భంగా తమ కల్యాణానికి విచ్చేసిన సకల దేవతాగణాలు, మునులు, రుషులకు ఆది దంపతులు వీడ్కోలు పలికారు. కృతజ్ఞతలు తెలిపారు. తొలుత ఆలయంలోని యాగశాలలో కలశాలకు ప్రత్యేకపూజలు చేశారు. శ్రీకాళహస్తీశ్వరుడు, జ్ఞానప్రసూనాంబ దేవి ఉత్సవర్లను అలంకార మండపంలో అలంకరించి, పూజలు నిర్వహించాక చప్పరాలపై కొండ చుట్టుకు తీసుకెళ్లారు. బేరివారి మండపం వద్ద బేరి కులస్థులు ఇచ్చిన నాగవల్లిని అమ్మవారికి ధరింపజేశారు. జయరామరావు వీధి, ఎన్టీఆర్ నగర్, తెలుగు గంగకాలనీ, కైలాసగిరికాలనీ, రాజీవ్‌నగర్‌కాలనీ మీదుగా గిరిప్రదక్షిణ జరిగింది. రామాపురం రిజర్వాయరు సమీపంలోని అంజూరు మండపం వద్ద కాసేపు ఉత్సవర్లు సేదతీరారు. ఆలయం తరఫున, దాతల ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. అక్కడ్నుంచి వెయ్యిలింగాలకోన, వేడాం మీదుగా శుకబ్రహ్మాశ్రమ సమీపంలోని ఎదురుసేవ మండపానికి సాయంత్రానికి చేరుకున్నారు. అక్కడ ఆలయ అధికారులు, అర్చకులు, భక్తులు స్వామి అమ్మవార్లకు స్వాగతం పలికారు. మండపంలో పూజల అనంతరం ఉత్సవమూర్తులను ముక్కంటి ఆలయానికి తీసుకొచ్చారు. కొండచుట్టుకు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆయా కార్యక్రమాల్లో ఆలయ ఈవో బాపిరెడ్డి, బొజ్జల రిషితారెడ్డి, ఉభయదారులు మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి దంపతులు, టీడీపీ నాయకులు చెంచయ్యనాయుడు, కంఠా రమేష్, ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



కైలాసగిరుల్లో స్వామి అమ్మవార్ల ఊరేగింపు

అశ్వ, సింహ వాహనాలపై ఆది దంపతుల వైభవం

కైలాసగిరి ప్రదక్షిణ చేసి సకల దేవతాగణాలకు వీడ్కోలు పలికిన ఆదిదంపతులు రాత్రి 8 గంటల తర్వాత ఆలయానికి చేరుకున్నారు. కొద్దిసేపు విశ్రాంతి తీసుకున్న అనంతరం శ్రీకాళహస్తీశ్వరుడు అశ్వ వాహనంపై, జ్ఞాన ప్రసూనాంబదేవి సింహ వాహనంపై అధిష్ఠించి పురవిహారం చేశారు. భక్తులు కర్పూర నీరాజనాలు సమర్పించారు.

బ్రహ్మోత్సవాల్లో నేడు

- ఉదయం 9గంటలకు: కేడిగ వాహనసేవ
- సాయంత్రం 7 గంటలకు: ధ్వజావరోహణం
- రాత్రి 9గంటలకు: సింహాసనం, కామధేనువు వాహనసేవ

ప్రాణాలతో చెలగాటం!

- ఎద్దుల పండుగ పేరుతో పకడ్బందీ వ్యాపారం

'మేము ఏమి చేసేది చెప్పండి. నాయకుల సిఫార్సు తెస్తారు. చూసీ చూడకుండా ఉండిపోవడం తప్ప ఏమీ చేయలేకపోతున్నాం. ఎక్కడైనా చావులు సంభవిస్తే మళ్లీ అంతా మా నెత్తిమీదికే వస్తుంది.'

..ఎద్దుల పండుగ పేరుతో జరిగిన జల్లికట్టులో ఇటీవల చోటుచేసుకున్న మృతిపై ఓ పోలీసు ఆఫీసరు ఆవేదన

'ప్రజా ప్రయోజనాలు, పార్టీ ప్రయోజనాల దృష్ట్యా ఈరోజు నుంచి కుప్పం మండలంలో ఎద్దుల పండుగను నిషేధించడమైనది. ఎవరైనా అతిక్రమించి నిర్వహించిన ఎడల, పార్టీ నాయకులకు ఎటువంటి సంబంధం లేదని తెలియజేసుకుంటున్నాము. నిర్వహించిన వారిపై పోలీసులు చట్టపరంగా చర్యలు తీసుకుంటారు.'

..ఇది ఒక మండల టీడీపీ నాయకులు పత్రికలకు విడుదల చేసిన ప్రకటన.

ఈ రెండు స్టేట్‌మెంట్లలో ఏది నిజం? కుప్పం నియోజకవర్గవ్యాప్తంగా జనవరి నెల ప్రారంభమైంది మొదలు, మార్చి నెల చివరి దాకా ఈ ఎద్దుల పండుగలు ప్రతి పంచాయతీలోని ఏదో ఒక గ్రామంలో జరుగుతూనే ఉంటాయి. జల్లికట్టు తరహా ఎద్దుల పందేలు, వాటిని నిలువరించడానికి యువకుల మధ్య పోటీలు, ఈ క్రమంలో గాయాలపాలై ఆస్పత్రులకు చేరడాలు.. అన్నీ జరుగుతున్నాయి. చివరకు ఒక యువకుడు తీవ్రంగా గాయపడి మృతి చెందాక కూడా కుప్పం మండలం మల్లానూరు పంచాయతీ పొన్నాంగూరు గ్రామంలో యథేచ్ఛగా సాగిన ఎద్దుల పందేలు, పలువురి గాయాలకు కారణమయ్యాయి.

కుప్పం, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): నిజానికి సంక్రాంతి పర్వాన్ని పురస్కరించుకుని కనుమ పండుగ రోజున వ్యవసాయానికి, పాడికి ఉపయోగించే పశువులను పూజించి, అలంకరించి వీధుల్లో వదలడం తెలుగు నేలలో వస్తున్న ఆనవాయితీ. అయితే దీన్నే కుప్పం నియోజకవర్గ గ్రామాలు ఎద్దుల పండుగ అని ఒకప్పుడు పిలుచుకునేవి. క్రమేణా ఈ ఎద్దుల పండుగ కాస్తా, ప్రాణాలు తీసే జల్లికట్టుగా రూపాంతరం చెందింది. 'గొప్ప ఎద్దుల పండుగ' పేరుతో బహుమతులు ప్రకటించి ప్రచార కరపత్రాలు, పోస్టర్లు ముద్రించి ఊరూవాడా ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు. పేరుకు పండుగే అయినా ఆ పేరుతో ఎద్దుల మధ్యే కాదు, వాటిని నిలువరించడానికి ప్రాణాలను లెక్క చేయకుండా ముందుకు దూకే యువకుల మధ్య కూడా ఈ సందర్భంగా పోటీ పెడతారు. విజేతలకు రూ.వేలల్లో నగదు బహుమతులతోపాటు, ఇంకా పలురకాల బహుమానాలు అందజేస్తారు. పొగరుబోతు ఎద్దులను నిలువరించే క్రమంలో తమ బలాన్ని నిరూపించుకుని సమీప గ్రామాల్లో వీరుడిగా పేరు పొందాలన్న తహతహ యువకులను ఈ పోటీలకు పురికొల్పుతోంది.

వైసీపీ ఆదర్శంగా

వైసీపీ అధికారంలో ఉన్న అయిదేళ్ల కాలంలో జల్లికట్టు ఫీవర్ కుప్పం నియోజకవర్గాన్ని ఊపేసింది. ఎక్కడపడితే అక్కడ ఎప్పుడు పడితే అప్పుడు వేలు, లక్షల రూపాయలు బహుమతులు ప్రకటించి భారీ స్థాయిలో అట్టహాసంగా ఎద్దుల పండుగ పేరుతో జల్లికట్టు నిర్వహించేవారు. ఏకంగా వైసీపీ ప్రధాన నాయకులు, వారి అనుచరులే రంగంలోకి దిగి హంగామా చేసేవారు. వారి ఆధ్వర్యంలోనే పోటీలు జరిగేవి. పోలీసు యంత్రాంగం ప్రేక్షకపాత్ర వహించేది. జల్లికట్టు సందర్భంగా ఎక్కడ ఎటువంటి మరణాలు సంభవించినా బయటకు వచ్చేవి కావు. కేసులు నమోదైన దాఖలాలు కూడా లేవు. ఇప్పుడదే బాటలో తెలుగు తమ్ముళ్లు కూడా నడుస్తున్నారు. నిజానికి జనవరి నెల మొత్తం జల్లికట్టు ఊసే లేదు. ఎక్కడైనా ఒకటీ అరా ఎద్దుల పండుగలు జరిగినా, పెద్దగా ప్రాణాంతక సంఘటనలకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో కొనసాగేవి. పార్టీ అధినేత చంద్రబాబు నియోజకవర్గం కావడంతో ఆయనమీద ఉన్న భయంతో టీడీపీ నాయకగణం ఇందులో జోక్యం చేసుకోవడానికి భయపడి దూరంగా ఉండేది. కానీ ఫిబ్రవరి నెల ప్రారంభమైనది మొదలు నియోజకవర్గంలో గ్రామగ్రామానా జల్లికట్టు ఊపందుకుంది. ఒకరొకరుగా స్థానిక నాయకగణం వీటి నిర్వహణలో నేరుగా జోక్యం చేసుకోవడం ప్రారంభమైంది. మొదట్లో అడ్డుకోవడానికి ప్రయత్నించిన పోలీసు యంత్రాంగాన్ని నయానో భయానో నియంత్రించి ఇష్టారాజ్యంగా ఎద్దుల పండుగ పేరుతో జల్లికట్టు పోటీలు నిర్వహిస్తున్నారు.

ప్రాణాలు పోయినా

ఎద్దుల పండుగ పేరుతో నిర్వహించే జల్లికట్టు పక్కా వ్యాపారమయంగా మారిపోయింది. స్థానికంగా అధికార పార్టీకి చెందిన నాయకులు లేదా పలుకుబడి కలిగిన కొంతమంది జట్టుగా ఏర్పడి జల్లికట్టు నిర్వహిస్తున్నారు. లక్షలాది రూపాయల బహుమతులు ప్రకటిస్తున్నారు. అయినా వ్యాపారం ఎందుకైందంటే, వీరు ప్రకటించిన బహుమతుల మొత్తకంటే టోకెన్ ధర పేరుతో వసూలు చేస్తున్న ప్రవేశ రుసుం ద్వారా చాలా అధిక మొత్తం నిర్వాహకుల జేబుల్లోకి చేరుతోంది. ఒక్క ఆంధ్రానుంచే కాక, సరిహద్దుల్లోని తమిళనాడు, కర్ణాటక గ్రామాలనుంచి వేల సంఖ్యలో ఎద్దులను ఈ జల్లికట్టు పోటీలకు తీసుకు వస్తుండడమే దీనికి కారణం. మల్లానూరు పంచాయతీ పొన్నాంగూరు గ్రామంలో గత నెలలో జరిగిన జల్లికట్టులో కరుణాకరన్ అనే యువకుడు తీవ్ర గాయాలపాలై చికిత్స పొందుతూ పక్కరోజు మృతి చెందాడు. అయినా సరే, జల్లికట్టు నిర్వహించడం మాత్రం ఆగడం లేదంటే కుప్పం నియోజకవర్గం ఈ ప్రాణాంతకమైన సంబరంలో ఎంతగా కూరుకుపోయిందో అర్థమవుతుంది.

లాభం ఎలాగంటే..

జల్లికట్టులో పాల్గొనే ఎద్దులకు ప్రవేశ రుసుం రూ.3వేలనుంచి 4వేలదాకా వసూలు చేస్తారు. బహుమతుల విషయానికి వస్తే సుమారు వంద దాకా ఉంటాయి. మొదటి మూడు బహుమతులు రూ.లక్ష, రూ.75వేలు, రూ.50వేలు ఉంటాయి. 500 ఎద్దులు పాల్గొనే జల్లికట్టుకు రూ.5లక్షల నుంచి 6లక్షల దాకా నిర్వహణ ఖర్చుంటుంది. ఈ ఖర్చు పోనూ దాదాపు రూ.8లక్షల నుంచీ రూ.9లక్షల దాకా నిర్వాహకులకు మిగులుతోంది. ఎద్దుల సంఖ్య పెరిగే కొద్దీ నిర్వాహకులకు ఆదాయం కూడా పెరుగుతుంది.

చట్టపరమైన చర్యలు తప్పవు



మేము ఎద్దుల పండుగ నిర్వహించుకోవడానికి అధికారికంగా ఎటువంటి పర్మిషన్ ఇవ్వలేదు. స్థానికంగా సంప్రదాయంగా వస్తున్న పండుగ అని చెబుతున్నారు నిర్వాహకులు. అయితే ఎద్దుల పండుగ నిర్వాహకులను ముందుగానే బైండోవర్ చేసుకుంటున్నాం. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా చర్యలు తప్పవని హెచ్చరిస్తున్నాం. **- డీఎస్పీ పార్థసారథి**



చిక్కపల్లె తాండాలో..

రామకుప్పం, మార్చి 2(ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం చిక్కపల్లెతాండాలో ఆదివారం మైలేరు పండుగ (ఎద్దులపరుగుపందేలు) కోలాహలంగా జరిగింది. గ్రామం జనసంద్రంగా మారింది. ఎద్దులను నిలువరించేందుకు యువకులు పోటీ పడ్డారు. మన జిల్లాతోపాటు తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి 170కి పైగా ఎద్దులను తీసుకొచ్చారు.



జాలారిపల్లెలో..

బైరెడ్డిపల్లె, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): జాలారిపల్లె గ్రామంలోనూ ఆదివారం మైలేరుపండుగ కోలాహలంగా జరిగింది. వివిధ ప్రాంతాల నుంచి ఎద్దులను తీసుకొచ్చి అల్లిలోకి వదిలారు. వీటిని నిలువరించడానికి యువకులు పోటీపడ్డారు.

మహిళా సాధికారత వారోత్సవాల ప్రారంభం



చిత్తూరు పరేడ్ మైదానంలో యోగాసనాలు వేస్తున్న పోలీసు ఉద్యోగులు, వారి పిల్లలు

చిత్తూరు అర్బన్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాలో ఆదివారం నుంచి మహిళా సాధికారత వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈనెల 8 వరకు మహిళల భద్రత, రక్షణకు సంబంధించిన అంశాలపై కార్యక్రమాలను నిర్వహించనున్నారు. ఆదివారం జిల్లాలోని పోలీసు స్టేషన్ల పరిధిలో మహిళా ఉద్యోగులకు యోగాపై శిక్షణ నిర్వహించారు. శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించుకోవడం, ఒత్తిడిని జయించడానికి కార్యక్రమం దోహదపడుతుందని ఎస్పీ మణికంఠ తెలిపారు.

నేటినుంచి ఓపెన్ స్కూల్ ఇంటర్ పరీక్షలు ప్రారంభం

చిత్తూరు సెంట్రల్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో సోమవారం నుంచి ప్రారంభం కానున్న ఓపెన్ స్కూల్ ఇంటర్మీడియట్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు జిల్లా విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు. ఈనెల 15వరకూ ఈ పరీక్షలు ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 12 గంటలవరకూ జరుగుతాయి. ఆర్జేడీ శామ్యూల్, డీఆర్వో మోహన్ కుమార్, డీఈవో వరలక్ష్మి, ఏడీ వెంకటేశ్వరావు, విద్యాశాఖ ముఖ్య అధికారులతో ఇప్పటికే ఏర్పాట్లపై చర్చించారు. గతేడాది జిల్లా కేంద్రంలో పరీక్షల తొలి రోజే మాస్ కాపీయింగ్‌కు జరగడం అప్పట్లో దుమారం రేగింది. ఈ పరిణామాల నేపథ్యంలో ఈసారి పటిష్ఠ చర్యలు తీసుకుంటున్నారు. ఫ్లైయింగ్ స్క్వాడ్‌లో డిప్యూటీ తహసీల్దార్లతోపాటు వీఆర్వోలూ పర్యవేక్షణ బాధ్యతలను నిర్వర్తించనున్నారు. జిల్లా వ్యాప్తంగా 3419 మంది పరీక్షలకు హాజరుకానున్నారు. చిత్తూరు డివిజన్‌లో 11, మదనపల్లె డివిజన్‌లో 3, పుత్తూరు డివిజన్‌లో ఒక సెంటర్ ఏర్పాటు చేశారు. 15 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 15 మంది డిపార్టుమెంటల్ అధికారులు, 142 మంది ఇన్విజిలేటర్లు, 15 సిట్టింగ్ స్క్వాడ్లు, నాలుగు ఫ్లైయింగ్ స్క్వాడ్లు ఏర్పాటు చేశారు. సెంటర్ల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంది. కాగా మాస్ కాపీయింగ్‌కు ఆస్కారం ఉండే ఓపెన్ స్కూల్ ఇంటర్ పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయకపోవడం, ఇన్విజిలేటర్ల విషయంలో జంబ్లింగ్ లేకపోవడం పలు అనుమానాలకు దారితీస్తున్నాయి. డీఈవో కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేయలేదు.

ప్రశాంత వాతావరణంలో నిర్వహిస్తాం



ఓపెన్ స్కూల్ ఇంటర్మీడియట్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహిస్తాం. విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేందుకు ఏర్పాట్లు చేశాం. సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదు. సెల్‌ఫోన్లకు అనుమతి లేదు. ఎవరి దగ్గరైనా గుర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. **- వరలక్ష్మి, డీఈవో**

సీఎంసీ- వేలూరు చిత్తూరు వెబ్‌సైట్ ప్రారంభం

చిత్తూరు అర్బన్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): వేలూరు సీఎంసీ ఆస్పత్రి ఆధ్వర్యంలో గర్భస్థ వ్యాధులు, శిశు మరణాలను అరికట్టడానికి, ఆస్తమా సేవల మెరుగుకు కీలక అడుగుపడింది. ఇందుకు సంబంధించిన వెబ్‌సైట్‌ను సీఎం చంద్రబాబు నాయుడు ప్రారంభించారు. శనివారం జీడీ నెల్లూరు పర్యటనకు వచ్చిన ఆయన ఈ సైట్‌ను ప్రారంభిస్తూ వివరాలపై ప్రత్యేకశ్రద్ధ పెట్టారు. వేలూరు సీఎంసీ, చిత్తూరు వైద్య ఆరోగ్యశాఖ స్టార్ ఎన్‌సీడీ ఐసీఎంఆర్- సీఎంసీ వేలూరు చిత్తూరు వెబ్‌సైట్‌ను రూపొందించాయి. రీసెర్చ్ స్కాలర్ డాక్టర్ జోరతీలాల్, కలెక్టర్ సుమిత్‌కుమార్‌లు ప్రాజెక్టు వివరాలను సీఎంకు వివరించారు. సీఎంసీ-చిత్తూరు క్యాంపస్‌లో 400 పడకలతో విస్తరణకు జరుగుతున్న వివరాలను తెలియజేశారు. ఆస్పత్రిలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల బుక్‌లెట్‌ను ఆయనకు అందజేశారు. కార్యక్రమంలో ఐసీఎంఆర్ ప్రాజెక్టు శాస్త్రవేత్తలు అశోక్‌కుమార్, అనిల్‌కుమార్, లోకేష్, డీఎంహెచ్‌వో సుధారాణి తదితరులు పాల్గొన్నారు.



చిత్తూరులోని చేపల మార్కెట్ వద్ద కిక్కిరిసిన జనం

బర్డ్ ఫ్లూ ఎఫెక్ట్ పెరిగిన చేపల ధరలు

చిత్తూరు రూరల్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): బర్డ్ ఫ్లూ కారణంగా చికెన్ షాపులు వెలవెలబోతున్నాయి. అదే సమయంలో చేపల ధరలు పెరిగిపోయాయి. ఇప్పటి వరకు జిల్లాలో బర్డ్ ఫ్లూతో ఒక్క కోడి కూడా చనిపోలేదని పశుసంవర్థకశాఖ అధికారులు చెబుతున్నారు. ఒకవేళ బర్డ్‌ఫ్లూ ఉన్నప్పటికీ 70 డిగ్రీల సెల్సియస్ వేడిలో ఉడికించి తింటే ఏమీ కాదని వైద్యులు పేర్కొంటున్నారు. అయినా జనం చికెన్‌షాపులవైపు చూడటం లేదు. చేపల మార్కెట్లు మాత్రం కళకళలాడుతున్నాయి. ఆదివారం కూడా చిత్తూరులోని చేపల మార్కెట్ జనంతో కిక్కిరిసింది.

కిలో ధరలు (రూపాయల్లో)

చేపలు	గతంలో	ప్రస్తుతం
జపాన్ పక్కి	70-80	100-150
బంగారుతీగ	80-100	100-200
పాంప్లెట్	100-120	200-250
కొరమీను	200-250	300-400

విద్యుదాఘాతంతో విద్యార్థి మృతి



సూరి (ఫైల్ ఫొటో)

గంగాధరనెల్లూరు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతానికి గురై ఓ విద్యార్థి మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. గంగాధర నెల్లూరు మండలంలోని కట్టకిందపల్లె దళితవాడకు చెందిన మాధవి, దినకరన్‌ల మూడో కుమారుడు సూరి (13) ఎట్టేరి శ్రీభానోదయ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్లో ఏడో తరగతి చదువుతున్నాడు. చర్చిలో ప్రార్థనల సందర్భంగా ఆదివారం ఉదయం మైక్‌సెట్ సరిచేస్తున్న క్రమంలో సూరి.. విద్యుదాఘాతానికి గురయ్యాడు. బాలుడిని 108 వాహనంలో చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. విద్యార్థి మృతికి సంతాపంగా భానోదయ ఇంగ్లీష్ మీడియం హైస్కూలుకు సోమవారం సెలవు ప్రకటించినట్లు కరస్పాండెంట్ మద్దిపట్ల నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ లావణ్య తెలిపారు. విద్యార్థి మృతిపై తమకు ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

శ్రీవారి సర్వదర్శనానికి 8 గంటలు

తిరుమల, మార్చి2(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 8 గంటల సమయం పడుతోంది. ఆదివారం సాయంత్రం 5 గంటల వరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 16 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

శుక్రవారం నాటి హుండీ ఆదాయం : **రూ.2.84 కోట్లు**
శనివారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు : **71,785**
తలనీలాలు సమర్పించినవారు: **23,481**

జిమ్ దాముకు మున్సిపల్ చైర్మన్‌గా అవకాశమివ్వాలి

వాల్మీకి సంఘం డిమాండ్



కుప్పంలో సమావేశమైన వాల్మీకి సంఘం నాయకులు

కుప్పం, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): కుప్పం మున్సిపల్ ఫ్లోర్ లీడర్, 19వ వార్డు కౌన్సిలర్ జిమ్ దాము అలియాస్ కె.దామోదరనాయుడుకు మున్సిపల్ చైర్మన్‌గా అవకాశం ఇవ్వాలని వాల్మీకి సంఘం ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. కుప్పం నియోజకవర్గంలోని కుప్పం, గుడుపల్లె, శాంతిపురం, రామకుప్పం మండలాలకు చెందిన వాల్మీకి సంఘం ముఖ్య నాయకులు ఆదివారం కుప్పం పట్టణంలోని జమీందారు బంగ్లా ఆవరణలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుప్పం జమీందార్లుగా గతంలో వాల్మీకులు ఉన్న చరిత్రను గుర్తు చేశారు. అప్పట్లో తమ జాతికి చెందిన జమీందార్లు ఎన్నో అభివృద్ధి పనులు చేశారని, ముఖ్యంగా దేవాలయాలకు మాన్యాలు దానం చేశారని చెప్పారు. కుప్పంలోని రాజావారి పార్కును అప్పటి కుప్పం పంచాయతీకి అప్పగించారని గుర్తు చేశారు. అయినా సరే, కుప్పంలో వాల్మీకి సామాజిక వర్గానికి ఇంతవరకు సముచిత స్థానం దొరకలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వాల్మీకి సామాజిక వర్గానికి చెందిన జిమ్ దాముకు మున్సిపల్ చైర్మన్‌గా అవకాశం ఇవ్వాలని కోరారు. ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత చంద్రబాబుతోపాటు ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ కంచర్ల శ్రీకాంత్‌కు ఈమేరకు వినతిపత్రం అందించామని పేర్కొన్నారు. మున్సిపల్ కౌన్సిలర్‌గా ఉన్న సురేష్ సైతం జిమ్ దాముకు తన మద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో జిమ్ దాముతోపాటు నియోజకవర్గంలోని వాల్మీకి సంఘం ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్సీ కంచర్ల తదితరులు

కుప్పం, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): నాయీ బ్రాహ్మణుల సెలూన్లకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు అందించ డానికి కూటమి ప్రభు త్వం రాష్ట్ర బడ్జెట్‌లో 450 కోట్లు కేటాయించిన నేపథ్యం లో ఆదివారం నాయీ బ్రాహ్మణుల ఆధ్వర్యంలో క్షీరాభిషేకం చేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నంలు మాట్లాడుతూ రాష్ట్ర బడ్జెట్టు అన్ని వర్గాలకు న్యాయం చేసిందన్నారు. ప్రజా సంక్షేమానికే కాక, అభివృద్ధికి పూచీపడిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు, మంత్రి నారా లోకేశ్‌కు ఆయన ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యుడు శాంతారాంతోపాటు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం



భగవద్గీతపై ప్రచారం చేస్తున్న ఇందూ జ్ఞానవేదిక సభ్యులు

పలమనేరు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): గంగవరం మండ లం దండపల్లి గ్రామంలో ఆదివారం త్రైత సిద్ధాంత భగవ ద్గీతపై ప్రచారం నిర్వహించారు. ఇందూ జ్ఞానవేదిక సభ్యులు ఇంటింటికీ వెళ్లి ఫాల్గుణ మాసం, హోళీ పౌర్ణమి పండుగల ప్రాధాన్యతలను వివరించారు. గోగి ప్రబోదానంద యోగీశ్వరస్వామి రచించిన త్రైత సిద్ధాంత భగవద్గీత పుస్తకాలను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి పలమనేరు, బంగారుపాళ్యం కమిటీ ల అధ్యక్షులు బాస్కర్, డి. బాలాజి, సభ్యులు వాణిశ్రీ, జ్యోతి, నాగమ్మ, రెడ్డెమ్మ, హేమంత్ పాల్గొన్నారు.

● రామకుప్పం: త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి కుప్పం సభ్యులు ఆదివారం రామకుప్పం మండలంలోని పలు గ్రామాల్లో త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం నిర్వహించారు. సమితి సభ్యులు కృష్ణ, శరవణ, కృష్ణమూర్తి, శివకృష్ణ, దేవరాజు, పార్థసారథి, దిలీప్, ఇందిర, వెంకటలక్ష్మీ, తిమ్మక్క పాల్గొన్నారు.

వైభవంగా కాళభైరేశ్వరస్వామి పుష్పపల్లకీ సేవ



పుష్పపల్లకీ సేవలో కాళభైరేశ్వరస్వామి

బైరెడ్డిపల్లె, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తీర్థం - కోట్రేపల్లె సమీపంలో ఉన్న కాళభైరేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో ప్రధానమైన పుష్పపల్లకీ సేవ శనివారం రాత్రి వైభవంగా జరిగింది. వివిధ రకాల పుష్పాలు, విద్యుద్దీపాలతో శోభాయమానంగా అలంకరించిన శివపార్వతుల ఉత్సవమూర్తులను పల్లకీలో కొలువుదీర్చారు. ఆలయ అర్చకులు భాస్కర్‌శివం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తీర్థం గ్రామం నుంచి ప్రారంభమైన పుష్పపల్లకీ ఊరేగింపు ఆదివారం తెల్లవారుజామున కాళభైరేశ్వరస్వామి ఆలయం వద్దకు చేరుకుంది. ఆలయం వద్ద అన్నదానం, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఆలయ ధర్మకర్త రాజారెడ్డి, అభివృద్ధి కమిటీ చైర్మన్ శ్రీనివాసమూర్తి, కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఉచితంగా కంటి వైద్యసేవలు



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

పుంగనూరు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక బీఎంఎస్‌క్లబ్ ఆవరణలో ఆదివారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. తెలిపారు. కుప్పం పీఈఎస్ మెడికల్ కాలేజ్ వైద్య బృందంచే వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. పలువురిని ఆపరేషన్ల కోసం ఎంపిక చేశారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ జిల్లా ప్రతినిధి డాక్టర్ శివ డాక్టర్ సరళ, లయన్స్‌క్లబ్ ప్రతినిధులు వరదారెడ్డి, ముత్యాలు, మునస్వామి, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

బోయకొండ గంగమ్మకు అభిషేకాలు



చౌడేపల్లె, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండలో గంగమ్మకు ఆదివారం అభిషేకాలు జరిగాయి. వేదపండితులు అమ్మవారిని స్వర్ణాభరణాలతో అలంకరించి దర్శనభాగ్యం కల్పించారు. ఈవో ఏకాంబరం ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పచ్చిగడ్డి కొరతతో అవస్థలు



మాకు ఆరు ఆడి ఆవులు ఉన్నాయి. ఎంతో ఆశతో వరి పంట సాగు చేశాం. ఆవులకు మేత ఉపయోగకరంగా ఉండేది. పంట కోత సమయంలో వరి గడ్డి వర్షాలతో తడిసి కుళ్లి పోయింది. ఎండు గడ్డి కొందామంటే కట్ట రూ.50 లకు మించి పలుకుతోంది. ట్రాక్టర్ లోడు రూ.20 వేలుకు మించిపోయింది. ఇతర జిల్లాల నుంచి తెచ్చుకోవడానికి రవాణా ఖర్చులు భారీగా పెరిగిపోయి తెచ్చుకోలేకపోతున్నాం. మేత కష్టం తప్పడంలేదు. మూగజీవాలను ఆదుకోవడానికి అధికారులు దృష్టి సారించాలి.

- సోమశేఖర్, పాడి రైతు, సోమల

ఇతర జిల్లాల నుంచి గడ్డి తెస్తున్నాం



పచ్చిమేత లేకపోవడంతో ఇక్కడ వరిగడ్డి లేక తిరుపతి, నెల్లూరు జిల్లా నుంచి రోలింగ్ వరిగడ్డి కట్టలను రూ.240 చొప్పున తెచ్చుకుంటున్నాం. వరిగడ్డికి డిమాండ్ పెరగడంతో ధరలు పెంచుతున్నారు. ఇతర ప్రాంతాల్లో వరిగడ్డిని కొనుగోలు చేసిన దళారులు, వ్యాపారులు గడ్డిని నిల్వ చేసి అధిక ధరలకు పాడి రైతులకు విక్రయిస్తున్నారు. మూగజీవాల ప్రాణాలు కాపాడుకోవడం కష్టంగానే ఉంది. కూటమి ప్రభుత్వం పాడిరైతులకు రాయితీపై గ్రాసం అందజేయడానికి చర్యలు తీసుకోవాలి.

- వి.నాగరాజ, పాడి రైతు, సోమల

పశుగ్రాసం కష్టాలు..!





- ● అడవుల్లోకి పాడిరైతుల పరుగులు
- ● వేసవికి ముందే తప్పని పాట్లు
- ● విక్రయాలకు పెడుతున్న పాడిసంపద
- ● రాయితీపై వరిగడ్డి పంపిణీ చేయాలని వేడుకోలు

సోమల, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): పాడి పరిశ్రమను నమ్ముకుని జీవించే రైతుకు పచిగడ్డి కొరత తీవ్రంగా ఉండటంతో ఎండుగడ్డి కోసం ఇబ్బందులు పడుతున్నారు. పశుగ్రాసం కొరతతో సోమల మండల పాడిరైతులు నానా అవస్థలు పడాల్సి వస్తోంది. పాడినే నమ్ముకున్న రైతులు గ్రాసం కోసం అడవికి వెళ్లి అడవి బోధను తెచ్చుకుంటున్నారు. సోమల, నెల్లిమంద, కందూరు, వల్లిగట్ల, కామిరెడ్డివారిపల్లె, నడింపల్లె, ఇరికిపెంట పంచాయతీలో తీవ్ర వర్షాభావ పరిస్థితులతో పశుగ్రాసం కొరతతో ఇబ్బందులు పడుతున్నారు. సోమల మండలంలో పూర్తిస్థాయిలో వ్యవసాయ రంగాన్నే నమ్ముకుని జీవనం సాగిస్తున్న రైతులు ఈ సంవత్సరం వరిసాగు అరకొరగా పంట సాగుచేశారు. వరి సాగుతో నష్టాలు చూసిన రైతులు పెరిగిన కూలీ ఖర్చులతో మండలంలో వరి సాగు 600 ఎకరాలకు మించలేదు. చెన్నపట్టం చెరువు, సీతమ్మ చెరువు, కందూరు కొత్త చెరువు, పేటూరు చెరువు, నంజంపేట కొత్తచెరువుల్లోనే నీటి నిల్వలు ఉన్నాయి. చెరువులో నీరున్నా వరి సాగు చేయకపోవడంతో మరో నెల రోజుల వరకు నీటి నిల్వలు ఉంటాయని రైతులు అభిప్రాయ పడుతున్నారు. కూరగాయలు మిరప, టమోటా రైతులను నష్టాలకు గురి చేస్తోంది. మండలంలో 75 శాతం కుటుంబాలు పాడి పరిశ్రమపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారు.

ప్రస్తుతం పశుగ్రాసం కొరత ఏర్పడి పాడి ఆవులను విక్రయించుకునే పరిస్థితి ఏర్పడింది. వరి గడ్డి కట్ట రూ.50 లకు మించిపోవడంతో సామాన్య రైతులు కొనుగోలు చేయలేని పరిస్థితి నెలకొంది. కొందరు రైతులు ఏర్పేడు, వరదయ్యపాళెం, రేణిగుంట తదితర ప్రాంతాలకు వెళ్లి ట్రాక్టరు లోడు రూ.20 వేలుకు తెచ్చుకుని వరిగడ్డిని పశువులకు మేతగా అందిస్తున్నారు. సామాన్య రైతులు ఉదయం అడవికి వెళ్లి బోధను తెచ్చుకుంటున్నారు. కొందరు అడవులకు నిప్పు పెట్టడంతో అడవిలో ఉన్న పశువుల మేత మంటల్లో కాలిపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. అధిక మంది రైతులు పాడి ఆవులను బీడు భూముల్లో మేత కోసం వదిలి పెడుతున్నారు. మరి కొంత మంది రైతులు గ్రాసం లేక పోవడంతో పశువులకు బీడు భూముల్లోని వయ్యారి భామ కలుపు మొక్కలను మేతగా వేస్తున్నారు. టీడీపీ ప్రభుత్వం అమలు చేసిన పశుగ్రాస క్షేత్రాలకు బిల్లులు అందక ఆ పథకం అర్ధాంతరంగా ఆగిపోయింది. వైసీపీ ప్రభుత్వం ఆ పథకాన్ని రద్దు చేసింది. పశుసంవర్ధక శాఖ అధికారులు స్పందించి పాడిరైతులకు రాయితీతో వరి గడ్డి కొనుగోలు చేసి పంపిణీకి చర్యలు చేపట్టాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

నేడు కడా పీడీ గ్రీవెన్స్ డే

కుప్పం, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): కుప్పం మండల సచివాలయంలో సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కడా పీడీ వికాస్ మర్మత్ వరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు కడా కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. నియోజకవర్గ పరిధిలోని వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు ఈ వేదికకు హాజరవుతారు. ప్రజలు వివిధ సమస్యలపై అర్జీలు సమర్పించి పరిష్కారాలు పొందడానికి నిర్వహించే ఈ కార్యక్రమాన్ని వినియోగించు కోవాలని కడా కార్యాలయ వర్గాలు కోరాయి.

గడ్డివాముల దగ్ధం

సోమల, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): సోమల మండలం నడింపల్లెకు చెందిన మారసాని నాగరాజ పొలం వద్ద నిల్వ చేసిన ఐదు గడ్డివాములు ఆదివారం ప్రమాదవశాత్తు దగ్ధమయ్యాయి. తిరుపతి-సోమల ప్రధాన రోడ్డు మార్గంలోని చెత్తకుప్పకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. ఆ మంటలు గడ్డివామి వరకు వ్యాపించాయి. సమీప రైతులు మంటలు అదుపుచేయడానికి ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. సుమారు రూ.లక్ష ఆస్తి నష్టం జరిగిందని వాపోయాడు.

ద్విచక్రవాహనదారుడికి గాయాలు

సోమల, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): సోమల-సదుం మార్గంలోని నడింపల్లె వద్ద ద్విచక్రవాహనం అదుపుతప్పి కింద పడటంతో కురవపల్లెకు చెందిన రాజన్నకు తీవ్ర గాయాలయ్యాయి. రాజన్న సోమల నుంచి కురవపల్లెకు ద్విచక్రవాహనంలో వెళ్తుండగా ప్రమాదం జరిగింది. సోమలలోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చికిత్సలు చేయించారు.

కారును ఎక్స్‌కవేటర్ ఢీకొని మహిళకు గాయాలు

సోమల, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): సోమల బీఎస్ఎన్ఎల్ కార్యాలయం వద్ద ఆదివారం ఉదయం తిరుమలకు వెళుతున్న కారును ఎక్స్‌కవేటర్ ఢీకొంది. ప్రమాదంలో అన్నమయ్య జిల్లా రామసముద్రం మండలం నరసాపురానికి చెందిన భాగ్యమ్మ (40) తలకు తీవ్ర గాయమైంది. ఆమెను సోమల ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్సలు అందించారు. మెరుగైన వైద్యసేవల కోసం పీలేరు వైద్యశాలకు తరలించారు.

ఘనంగా త్రిశూల స్నానం

పుంగనూరు రూరల్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నెక్కుంది సమీపంలో వెలసిన అగస్తీశ్వరస్వామికి ఆదివారం అర్చకులు త్రిశూలస్నానం నిర్వహించారు. ఆదివారం ఉదయాన్నే ఆలయాన్ని శుభ్రం చేసి స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. మధ్యాహ్నం ఉత్సవ విగ్రహాలను ఆలయ అర్చకులు స్థానిక కోనేరు వద్దకు తీసుకెళ్లి శివపార్వతులకు వసంతోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం త్రిశూల స్నానం చేయించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

పొలం గట్టుపై నుంచి పడి వివాహిత మృతి



మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న టీడీపీ నేతలు, మృతిచెందిన సుకన్య (ఫైల్ ఫొటో)

రామకుప్పం, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): పొలం గట్టుపై నుంచి జారిపడి ఓ వివాహిత మృతిచెందిన సంఘటన శనివారం రామకుప్పం మండలంలో జరిగింది. పోలీసుల కథనం మేరకు.. బందార్లపల్లె పంచాయతీ గడ్డూరుకు చెందిన టీడీపీ నేత సతీష్ భార్య సుకన్య శనివారం పాడిఆవులను తీసుకుని మేపేందుకు పొలాల వద్దకు వెళ్లింది. ఆవులను మేపుతుండగా ఓ ఆవు బలంగా లాగడంతో ఆమె పొలం గట్టుపై నుంచి కింద పడి తీవ్రంగా గాయపడింది. సమీపంలోని రైతులు ఆస్పత్రికి తరలించే లోపే మృతిచెందింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

టీడీపీ నేతల పరామర్శ

భార్యను కోల్పోయిన సతీష్‌ను టీడీపీ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, పార్టీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆనందరెడ్డి, నరసింహులు, ఎస్టీసెల్ జిల్లా అధ్యక్షుడు కృష్ణానాయక్‌లు ఆదివారం స్థానిక నేతలతో కలిసి పరామర్శించారు. సుకన్య మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం బందార్లపల్లె టీడీపీ శ్రేణులు సమకూర్చిన రూ.31 వేలు సతీష్‌కు అందించారు. కార్యక్రమంలో తెలుగు యువత మండల అధ్యక్షుడు కృష్ణానాయక్, నాయకులు శ్రీనాథరెడ్డి, రామ్మూర్తి, మహ్మద్‌రఫీ, వెంకటరమణ, బాలరాజు, సుబ్రీ, నవీన్, మునిరెడ్డి, చంద్రశేఖరరెడ్డి, బీఆనందరెడ్డి, రఘు, సోమశేఖర్, ప్రకాష్, మురళీమోహన్, గిరి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలోకి భారీగా చేరికలు

● కండువాలు కప్పి ఆహ్వానించిన చల్లా రామచంద్రారెడ్డి



రొంపిచెర్లలో టీడీపీలో చేరిన సర్పంచులు, వైసీపీ నాయకులు

రొంపిచెర్ల, మార్చి 2: (ఆంధ్రజ్యోతి) రొంపిచెర్ల మండల వైస్ ఎంపీపీ నూలురెడ్డెప్ప, రొంపిచెర్ల, బండకిందపల్లె సర్పంచులు ఆర్. ఇబ్రహీం ఖాన్, అన్వర్‌బాషా, ఎంపీటీసీలు రహీ మాబీ, మాజీ ఎంపీటీసీ సాధియా, మాజీ జడ్పీటీసీ మల్లెల చంద్రమ్మ, ఉపసర్పంచ్ శ్రీపతి లక్ష్మీదేవి, వార్డు మెంబర్లు లక్ష్మయ్య, చిన్న నాగరాజ, బావా జాన్‌లతో పాటు వారి అనుచ రులైన 50 కుటుంబాలవారు వైసీపీని వీడి ఆదివారం పుంగనూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి ఆధ్వ ర్యంలో టీడీపీలో చేరారు. వీరికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రొంపిచెర్ల పంచాయతీలో వైసీపీ యువ నాయకులు రాయచోటి హలీంఅలీఖాన్, నాషాద్, చాను, అన్వర్, మస్తాన్, అర్షాద్, శ్రీపతి, బషీర్, పెద్దమల్లెల పంచాయతీలో వైసీపీ నాయకులు ఎం.భాస్కర్‌రెడ్డి, చిన్నరెడ్డెప్ప, శ్రీనివాసులు, పాతపాళెం చెంగ్రాములు, మునిరాజ, గాలి ఉమాపతి, పింఛా సుధాకర్ తదితరులు పార్టీలో చేరారు. కురబ కార్పొరేషన్ డైరెక్టర్ ఉయ్యాల రమణ, మాజీ సర్పంచులు రవికుమార్‌నాయుడు, ఓబులేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలకు విశేష స్పందన



రామకుప్పంలో వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్లు

రామకుప్పం, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం పాలరేవుగడ్డ బాలమురుగన్ ఆలయ కమిటీ, కుప్పం బీఆర్‌డీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, శ్రీప్రియ నర్సింగ్ హోంల ఆధ్వర్యంలో మండలంలోని సింగసముద్రం, బల్ల గ్రామాల్లో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాలకు విశేష స్పందన లభించింది. సింగసముద్రంలో నిర్వహించిన శిబిరంలో 250 మంది రోగులకు, బల్లలో నిర్వహించిన శిబిరంలో 276 మంది రోగులకు చికిత్సలందించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఆసుపత్రుల అధినేతలు డా.సురేష్‌బాబు, డా.సుధీర్, వైద్యులు మండవ హరిత, దేవేంద్ర, ప్రసాద్, టీడీపీ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, బీసీసెల్ కార్యనిర్వాహక కార్యదర్శి పత్రి నారాయణాచారి, పార్టీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆనందరెడ్డి, నరసింహులు, మాజీ ఎంపీపీ ఆంజనేయరెడ్డి, నేతలు రామ్మూర్తి, మహ్మద్‌రఫీ, శ్రీనివాసులురెడ్డి, జయశంకర్, విశ్వనాథ్, మనోహర్, కృష్ణప్ప, ఎర్రప్ప, మునిరత్నం, మురుగేష్, పెరియప్ప, నారాయణ, మూర్తి, వెంకటేష్ పాల్గొన్నారు.

●పలమనేరు: పలమనేరు రిక్రియేషన్ క్లబ్ ఆవరణలో ఆదివారం నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. ఈ శిబిరంలో చెన్నై శంకర నేత్రాలయ వైద్యులు 70 మందికి నేత్ర పరీక్షలు నిర్వహించారు. ఇందులో 40 మందికి ఆపరేషన్లకు ఎంపిక చేశారు. వీరికి శంకర నేత్రాలయలో ఉచితంగా శస్త్రచికిత్సలు చేయడంతో పాటు అన్ని తామే భరిస్తామని డాక్టర్ మురళీ తెలిపారు.



పలమనేరు: రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

● పలమనేరు: పలమనేరు సాయిరాం ఆస్పత్రిలో ఆదివారం నిర్వహించిన మెగా వైద్య శిబిరంలో 200 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ డేగల ప్రభాకర్ మాటాడుతూ ఉచిత వైద్యశిబిరాలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని.. ఆస్పత్రి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో వైద్యనిపుణులు రెడ్డిబాషా, యుగంధర్, తరంగిణి పాల్గొన్నారు.

సమష్టి సహకారంతోనే అభివృద్ధి సాధ్యం



మాట్లాడుతున్న తహసీల్దారు సీతారామ్

గుడుపల్లె, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయ సహకారంలోనే అభివృద్ధి సాధ్యమని జడ్పీటీసీ కృష్ణమూర్తి పేర్కొన్నారు. ఆదివారం ఎంపీడీవో కార్యలయంలో ఎంపీపీ వరలక్ష్మీ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న వేసవిలో తాగునీటికి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు చూడాలన్నారు. మండలంలోని పలు చెరువుల నుంచి అనుమతులు లేకుండా విచ్చలవిడిగా రియల్ ఎస్టేట్ వ్యాపారులు భూములకు మట్టి తరలిస్తున్నా అధికారులు చూసీచూడనట్లు వ్యవరిస్తున్నారని.. అధికారులు చర్యలు తీసుకోవాలని తహసీల్దారు సీతారామ్‌ను కోరారు. గ్రామాల్లోని పలు మార్గాల్లో ఆర్టీసీ బస్సులు నడపాలని సర్పంచులు వెంకటేష్, నారాయణ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. పశువులు రోగాల బారిన పడుతున్నాయని.. ఆసుపత్రిలో మందుల కొరత ఉందని పలువులు సభ్యులు వాపోయారు. పొగురుపల్లె పాఠశాలలో ఉపాధ్యాయుల కొంత ఉందని . అదనంగా ఉపాధ్యాయులను నియమించాలని సర్పంచ్ మీనాక్షి కోరారు. అనంతరం ఆయా శాఖల అధికారులు మూడునెలల ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. సమావేశంలో ఎంపీడీవో రాధాకృష్ణ, వైస్ ఎంపీపీ శ్రీనివాసులు, పలు శాఖల అధికారుల, పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

సమాజంలో ఉపాధ్యాయ వృత్తి ఉన్నతం

● ఎమ్మెల్యే అమరనాథరెడ్డి



ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

పెద్దపంజాణి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): సమాజంలో ఉపాధ్యాయ వృత్తి ఎంతో ఉన్నతమైందని పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి అన్నారు. పెద్దపంజాణి మండలం శ్రీరామాపురం జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు నారాయణ పదవీ విరమణ సందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సమాజానికి దిశా నిర్దేశం చేసే శక్తి ఉపాధ్యాయ వృత్తికే ఉందన్నారు. ఆయన సేవలు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే సతీమణి రేణుకారెడ్డి, నాయకులు మురహరిరెడ్డి, సుదాకరరెడ్డి, పాఠశాల కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు వారపుసంతకు బహిరంగ వేలం

పుంగనూరు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వారపుసంత, దినసరి కూరగాయల మార్కెట్, ప్రైవేటు బస్టాండు, పుంగమ్మ చెరువు కట్టపై ఉన్న మరుగుదొడ్లు తదితర వాటికి సోమవారం బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. ప్రభుత్వ నియమ నిబంధనల మేరకు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలని కోరారు.

లారీ దిగుతూ కిందపడి క్లీనర్ మృతి



మృతిచెందిన మంజునాథ్

పలమనేరు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): లారీపై పట్ట కట్టి కిందకు దిగుతూ జారిపడి క్లీనర్ మృతి చెందిన సంఘటన ఆదివారం పలమనేరు సమీపంలో జరిగింది. లారీ డ్రైవర్ కథనం మేరకు.. కర్ణాటక రాష్ట్రం బాగల్‌కొట్టు తాలూకా కలదిగి గ్రామానికి చెందిన మంజునాథ్ (38) లారీ క్లీనర్‌గా పనిచేస్తున్నాడు. కర్ణాటక నుంచి తమిళనాడులోని గుడియాత్తంకు వెళ్లి మార్గంమధ్యలోని కాలువపల్లి చెక్‌పోస్టు సమీపంలోకి రాగానే పైనున్న పట్ట గాలికి వేలాడుతుండటంతో లారీ ఆపారు. క్లీనర్ మంజునాథ్ పైకి ఎక్కి పట్టను తాడుతో కట్టి దిగుతూ ప్రమాదవశాత్తు కాలుజారి కిందకు పడిపోయాడు. ప్రమాదంలో మంజునాథ్ తీవ్రంగా గాయపడ్డాడు. 108 వాహనంలో పలమనేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అప్పటికే మంజునాథ్ మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు పట్టాలపై వ్యక్తి ఆత్మహత్య

చిత్తూరు రూరల్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): రైలు పట్టాలపై తలపెట్టి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన చిత్తూరు-కాట్పాడి మార్గంలో జరిగింది. శనివారం అర్ధరాత్రి బొమ్మసముద్రం సమీపంలో ఈ ఘటన జరిగిందని చిత్తూరు రైల్వే ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. లోకోపైలెట్ ఇచ్చిన సమాచారం మేరకు ఘటనా స్థలాన్ని పరిశీలించామన్నారు. మృతిచెందిన వ్యక్తికి సుమారు 40 నుంచి 45 మధ్య వయస్సు ఉంటుందన్నారు. ఘటనను పరిశీలిస్తే ఆత్మహత్య చేసుకున్నట్లు తెలుస్తోందన్నారు.

మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభం


వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న సుగుణాకర్‌రెడ్డి

తవణంపల్లె,మార్చి 2 (ఆంధ్రజ్యోతి): జన్మభూమి స్ఫూర్తిగా మినరల్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసి ప్రారంభించినట్లు అర్థగిరి ఆలయ ట్రస్టు మాజీ చైర్మన్ పైమాగం సుగుణాకర్‌రెడ్డి అన్నారు. ఆదివారం అరగొండ పంచాయతీ బీసీ కాలనీలో మినరల్ వాటర్ ప్లాంటును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అరగొండతో పాటు నియోజకవర్గ ప్రజల ఆరోగ్యం కోసం మినరల్ వాటర్ ప్లాంటులను ఏర్పాటు చేస్తామన్నారు.. ఇప్పటికే 17 వాటర్ ప్లాంట్లను ప్రారంభించినట్లు పేర్కొన్నారు. మరో మూడు వాటర్ ప్లాంట్లు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మల్లుదొరై, మాజీ సర్పంచ్ కరీం, ప్రశాంత్‌కుమార్, గ్రామస్థులు పాల్గొన్నారు.

పేదవర్గాల అభివృద్ధికి బడ్జెట్ దోహదం


సమావేశంలో మాట్లాడుతున్న షణ్ముగం

చిత్తూరు అర్బన్, మార్చి 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ పేద వర్గాలకు అనుకూలంగా ఉందని దక్షిణాది రాష్ట్రాల బీసీ సంక్షేమ సంఘం ఇన్‌చార్జి షణ్ముగం, వడ్డెర సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు రవీంద్రరాజు చెప్పారు. ఆదివారం బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వం బడ్జెట్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు అధిక నిధులను కేటాయించిందన్నారు ఆదరణ-3కి రూ. 1000 కోట్లు కేటాయించడం బీసీల పట్ల ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. చేనేత కార్మికులకు, నాయీ బ్రాహ్మణులకు ఉచిత విద్యుత్‌ను అందిస్తామనడాన్ని స్వాగతించారు. సమావేశంలో వివిధ సంఘాల నేతలు ప్రతాప్, లావణ్య, రుద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన



విజయపురం, మార్చి 2(ఆంధ్రజ్యోతి): పాతార్కాడులో ఆదివారం అడాప్ట్ ఎ విలేజ్ గ్లోబల్ ఫౌండేషన్(అమెరికా) ఆర్థిక సహాయంతో ఫౌండర్ పండేటి భూపతిరాజు పీకాక్ హాస్పిటల్ ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. జంబాడ, పాతార్కాడు, కోసలనగరం, నేస్రహా నగర్ క్లస్టర్ నుంచి సుమారు 250 మంది వైద్య పరీక్షలు చేసుకున్నారు. కార్యక్రమంలో వాకర్స్ అసోషియేషన్ అధ్యక్షుడు రవిరాజు, పీకాక్ ఆస్పత్రి ఎండీ కిరణ్, ఐఎఫ్‌టీఆర్ బోర్డు మెంబరు దొమ్మరాజు క్రిష్ణమరాజు, గైనకాలజిస్ట్ అనుపకిరణ్, దంత వైద్యుడు జపమేరీ ప్రసన్నకుమార్, టీడీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల అందజేత



చిత్తూరు కల్చరల్, మార్చి2 (ఆంధ్రజ్యోతి): అమెరికన్ ప్రోగ్రెసివ్ తెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలోని బలిజ సామాజిక వర్గం విద్యార్థులకు ఆదివారం స్కాలర్ షిప్స్ పంపిణీ అందజేశారు. గిరింపేట వీరాంజనేయ స్వామి కల్యాణమండపంలో జరిగిన కార్యక్రమంలో 20 మంది విద్యార్థులకు వీటిని పంపిణీ చేసారు. కార్యక్రమంలో రెడ్డిగుంట కిషోర్, డి.వి.గిరి, శ్రీధర్, వంశీ, ప్రభాకర్, కోల కిరణ్, చందు, కుమార్, భాను, పూర్ణ, హరీష్, మౌళి, సింధు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల కలయిక



చిత్తూరు అర్బన్, మార్చి 2(ఆంధ్రజ్యోతి): పెనుమూరు మండలం ఉగ్రాణంపల్లె హైస్కూల్‌లో 1967-68 బ్యాచ్‌కు చెందిన టెన్త్ క్లాస్ బ్యాచ్ విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. స్థానిక ఎన్‌జీవో భవనంలో జరిగిన కార్యక్రమంలో 30 మంది వర కు పాల్గొన్నారు. రైతు నుంచి ఉన్నతోద్యోగం చేసి పదవీ పదవీ విరమణ పొందిన వారంతా ఒక చోట చేరి అప్యాయంగా పలకరించుకున్నారు. చదువుకున్న రోజులను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో సుబ్రహ్మణ్యం నాయుడు, వేణుగోపాల్‌నాయుడు, దొరస్వామి నాయుడు, చిన్నస్వామి, నారాయణ, రాణి, అమరావతి, పుష్ప, కృష్ణారెడ్డి, దొరస్వామి పిళ్లై, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా రైల్వే సబ్‌వే మార్గం


తుప్పుపట్టి విరిగిపోయిన ఇనుప పైపులు

చిత్తూరు సిటీ, మార్చి2 (ఆంధ్రజ్యోతి): తుప్పు పట్టి విరిగిపోయిన ఇనుప పైపులతో రైల్వే సబ్‌వే మార్గం ప్రమాదకరంగా తయారైంది. స్థానిక దొడ్డిపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి కింద సబ్ వేమార్గం ఇబ్బందికరంగా మారింది. బ్రిడ్జి నిర్మించినపుడు సబ్ వేలో వాహనాల రాకపోకలకు కాలువపై ఇనుప పైపులు అమర్చారు. కాగా ఇవి ఇప్పుడు తుప్పపట్టి విరిగిపోయాయి. దీంతో ఈ మార్గంలో ప్రయాణించేవారు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. రాత్రి వేళల్లో ఈమార్గంలో చీకటిగా ఉండటంతో దారి కూడా సక్రమంగా కనిపించడంలేదు. సంబంధిత అధికారులు స్పందించి ఇనుపపైపులను మార్చాలని, లైట్లు మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

అడవికి నిప్పు పెట్టిన ఆకతాయిలు



శ్రీరంగరాజపురం, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వ్యక్తులు అడవికి నిప్పు పెట్టారు. స్థానికుల కథనం మేరకు ఆదివారం మండల పరిషత్ సమీపంలో అడవికి ఆకతాయిలునిప్పు పెట్టడంతో మొక్కలు,చిన్నచెట్లు కాలిపోయాయి. ఆటవీశాఖ అధికారులు స్పందించి కాపాడాలని వాపోతున్నారు.

మహిళలకు మన సంస్కృతి కళాసంస్థ సత్కారం


మన సంస్కృతి కళాసంస్థ ఆధ్వర్యంలో సన్మానం పొందిన వివిధ రంగాల మహిళలు

చిత్తూరు కల్చరల్, మార్చి 2(ఆంధ్రజ్యోతి): మన సంస్కృతి కళాసంస్థ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక విజయం విద్యాసంస్థలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. కార్యక్రమానికి చుడా చైర్‌పర్సన్ కఠారి హేమలత హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ మహిళలు లేనిదే మనుగడ సాధించలేమన్నారు. అన్ని రంగాల్లో తమదైన కృషి, సేవ, పట్టుదలతో ఆర్థికంగా ముందంజ వేయాలని పిలుపునిచ్చారు. డాక్టర్ రామలక్ష్మమ్మ మాట్లాడుతూ స్త్రీలు నేడు అన్ని రంగాల్లో ఉన్నత స్థానంలో ఉన్నారన్నారు. వీటి వెనుక స్త్రీల ఆత్మస్థయిర్యం మెచ్చుకోదగిందన్నారు. వివిధ రంగాలకు చెందిన 50 మంది మహిళలను సత్కరించారు. కార్యక్రమంలో రచయితలు శ్యామలాదేవి, శాంతాభాస్కర్, అరుణకుమారిలతో పలువురు పాల్గొన్నారు.

నేడు పీజీఆర్ఎస్ కార్యక్రమం

చిత్తూరు అర్బన్, మార్చి 2(ఆంధ్రజ్యోతి): నగరపాలక కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పీజీఆర్ఎస్ కార్యక్రమం జరుగుతుందని కమిషనర్ నరసింహ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. కార్యాలయ ఆవరణలో జరిగే కార్యక్రమంలో ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరిస్తామన్నారు. అధికారులంతా హాజరుకావాలని ఆదేశించారు. నగర ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నీటి సమస్య పరిష్కారానికి ప్రత్యేక సెల్ ఏర్పాటు

చిత్తూరు అర్బన్, మార్చి 2(ఆంధ్రజ్యోతి): వేసవి నేపథ్యంలో నగరపాలక పరిధిలో నీటి సమస్య పరిష్కారం కోసం నగరపాలక కార్యాలయంలో ప్రత్యేక సెల్‌ను ఏర్పాటు చేసినట్లు కమిషనర్ నరసింహప్రసాద్ తెలిపారు. నగరంలో ఎక్కడైనా నీటి సమస్య ఉంటే కార్యాలయంలో సెల్ నెంబరు 9849907885కు ఫోన్‌కాల్ లేదా వాట్సాప్‌కు ఫిర్యాదు చేయవచ్చన్నారు. నీటి ఎద్దడి తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. నగర ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

మంత్రి లోకేష్‌ను కలిసిన ఎమ్మెల్యే గురజాల


లోకేష్ దంపతులతో జగన్మోహన్

చిత్తూరు సిటీ, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్‌ను ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. విజయవాడలో వ్యక్తిగత సహాయకుడు సాంబశివరావు కుమార్తె నిశ్చితార్థ వేడుకలకు సతీసమేతంగా పాల్గొన్న లోకేష్‌ను గురజాల జగన్ కలిసి కాస్సేపు ముచ్చటించారు.

4న రాయితీ రుణాలకు ఇంటర్వ్యూలు

చిత్తూరు అర్బన్, మార్చి 2(ఆంధ్రజ్యోతి): రాయితీ రుణాల కోసం దరఖాస్తులు చేసుకున్న లబ్ధిదారులకు ఈ నెల 4న ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ నరసింహ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. 4న 1 నుంచి 25 డి విజన్లలో దరఖాస్తులు చేసుకున్న వారికి, 5న 26 నుంచి 50 డివిజన్ల వారికి ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. చిత్తూరు నగరపాలక కార్యాలయంలో జరిగే ఈ ఇంటర్వ్యూలకు దరఖాస్తుతో జత చేసిన ధ్రువపత్రాల ఒరిజినల్స్‌తో హాజరుకావాలన్నారు. ఇంటర్వ్యూ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతుందని వివరించారు.

అనవసర విమర్శలు చేస్తే సహించం: టీడీపీ

గుడిపాల, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వాన్ని అనవసరంగా విమర్శిస్తే సహించేదిలేదని మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్ అన్నారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో తప్పులను ఎత్తిచూపితే అక్రమకేసులు పెట్టారన్నారు. దౌర్జన్యాలు చేసి ప్రజలను భయభ్రాంతులకు గురిచేశారన్నారు. ప్రజలు బయటకు రావాలన్నా తీవ్ర ఇబ్బందులు పడేవారన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడినతర్వాత రాష్ట్రంలో అభివృద్ధితో పాటు ప్రజలు స్వేచ్ఛగా తిరుగుతున్నారన్నారు. వైసీపీ ప్రభుత్వంలో దోచుకోవడమే తప్ప చేసిందేమి లేదన్నారు. వైసీపీ నాయకులు విమర్శలు మాని అభివృద్ధికి సహకరించాలనారు.

పొలం గట్టుపై నుంచి పడి వివాహిత మృతి


సుకన్య (ఫైల్ ఫొటో)

రామకుప్పం, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): పొలం గట్టుపై నుంచి జారిపడి ఓ వివాహిత మృతిచెందిన సంఘటన శనివారంజరిగింది. పోలీసుల కథనం మేరకు.. బందార్లపల్లె పంచాయతీ గడ్డూరుకు చెందిన టీడీపీ నేత సతీష్ భార్య సుకన్య శనివారం పాడిఆవులను తీసుకుని మేపేందుకు పొలాల వద్దకు వెళ్లింది. ఆవులను మేపుతుండగా ఓ ఆవు బలంగా లాగడంతో ఆమె పొలం గట్టుపై నుంచి కింద పడి తీవ్రంగా గాయపడింది. సమీపంలోని రైతులు ఆస్పత్రికి తరలించేలోపే మృతిచెందింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అంగన్వాడీ కేంద్రాల్లో కూరగాయల సాగు

వినూత్న ప్రయోగంతో సత్ఫలితాలు



ఎన్‌టీఆర్ కాలనీ అంగన్వాడీ కేంద్రం వద్ద పంటను పరిశీలిస్తున్న సీడీపీవో -వింజం అంగన్వాడీకేంద్రంలో సేకరించిన కూర ఆకు

గంగాధరనెల్లూరు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): అంగన్వాడీ కేంద్రాల్లో ఓ వినూత్న కార్యక్రమానికి అడుగులు పడ్డాయి. చిన్నారులకు,గర్భిణులకు సంపూర్ణ పోషకాహారం అందజేయాలనే సంకల్పంతో ప్రభుత్వం చక్కని కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. సాగునీటి సదుపాయమున్న అంగన్వాడీ కేంద్రాల్లో కూరగాయల సాగు చేయాలని నిర్ణయించింది. మహిళా, శిశుసంక్షేమశాఖ ద్వారా ఎంపిక చేసిన కేంద్రాల్లో ఇప్పటికే సాగు ప్రారంభమైంది. అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లు కూరగాయల సాగులో పాలు పంచుకోవాలని ప్రభుత్వం సూచించింది. రెండు నెలల క్రితమే ఎంపిక చేసిన కేంద్రాలకు ఇందుకోసం రూ.10వేలు మంజూరు చేసింది. ఈక్రమంలో అంగన్వాడీ కేంద్రం భవనాల చుట్టుపక్కల ఖాళీస్థలాలొంల కూరగాయలు, ఆకుకూరలను సాగు చేస్తున్నారు. గంగాధరనెల్లూరు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో మొదటి విడతగా మండలాల వారీగా గంగాధరనెల్లూరులో 34, పాలసముద్రంలో 25, పెనుమూరులో 28 కేంద్రాలను ఎంపిక చేశారు. ఆయా కేంద్రాల వద్ద జామ, దానిమ్మ, నెల్లికాయ, మునగ, బొప్పాయి, సపోట మొక్కలు కూడా నాటి సంరక్షిస్తున్నారు. ఇక్కడ సాగు చేసిన కూరగాయలు, ఆకుకూరలతో తయారు చేసిన వంటకాలను చిన్నారులకు,బాలింతలకు అందజేస్తున్నారు.

పోషకాహారం అందిస్తున్నాం



పక్కాభవనాలు, నీటిసౌకర్యం ఉన్న కేంద్రాలను ఎంపిక చేశాం. అంగన్వాడీ కేంద్రాలు ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు రోజూ పోషకాహారం అందజేయడానికి వీలు పడుతోంది. దీనివల్ల ఆరోగ్యపరంగా కలిగే లాభాలను గురించి తెలియజేస్తున్నాం.

- గుండ్లపల్లె వినతశ్రీ, సీడీపీవో

నగరంలో ఎక్కువ ఏటీఎంలు అలంకారప్రాయమే


పనిచేయని ఏటీఎం మిషన్లతో ఇబ్బంది పడుతున్న ఖాతాదారులు

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): నగరంలో 80శాతం ఏటీఎంలు సక్రమంగా పనిచేయడం లేదు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రకాశం హైరోడ్డులోని స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రధాన కార్యాలయం ఆవరణలో ఏటీఎం కౌంటర్ ఉంది. అందులో ఎనిమిది ఏటీఎం మిషన్లు ఉన్నాయి. వీటిలో మిషన్లు నెలల తరబడి మూతబడ్డాయి. మరో రెండు పనిచేయడం లేదు. ఒక్క ఏటీఎం మాత్రమే పనిచేస్తుండడంతో ఖాతాదారులు నగదు డ్రాచేసుకోవడానికి, డిపాజిట్ చేయడానికి గంటలతరబడి సమయం వెచ్చించాల్సి వస్తోంది. మూతబడ్డ, పనిచేయని ఏటీఎంలను వినియోగంలోకి తీసుకురావాలని ఖాతాదారులు కోరుతున్నారు.

వాటర్ ప్లాంటు బిల్లుల జాప్యంపై సభ్యుల ఆగ్రహం


వాటర్ ప్లాంటుపై వివరణ ఇచ్చాకే సభ నిర్వహించాలని పట్టుబడుతున్న సభ్యులు

పెనుమూరు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): వాటర్‌ప్లాంట్ల బిల్లుల జాప్యంపై మండల సర్వసభ్య సమావేశంలో సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం ఎంపీపీ హేమలత అధ్యక్షతన ఎంపీడీవో కార్యాలయంలో సమావేశం జరిగింది. పులికల్లు ఎంపీటీసీ, సర్పంచ్‌లు మాట్లాడుతూ గతంలో ఆదేశాల మేరకు నిర్మించిన వాటర్‌ప్లాంట్‌లకు బిల్లులు పెట్టలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. గొడుగుమానుపల్లిలో ప్లాంట్‌కు బిల్లులు ఎందుకు పెట్టలేదంటూ నిలదీశారు. ఎంపీ నిధులతో మంజూరయిన ప్లాంటు నిర్మాణం పూర్తయ్యి ఆరు నెలయినా బిల్లు పెట్టకపోవడం సరికాదంటూ నిరసన వ్యక్తం చేశారు. పై అధికారులతో మాట్లాడి చెబుతానంటూ ఏఈ సర్దిచెప్పారు. 50 పడకల ఆసుపత్రి నిర్మాణంలో ఉన్నందున దాతలు షెడ్డు నిర్మించి ఇస్తే తమకు ఉపయోగపడుతుందని మెడికల్ ఆఫీసర్ గీత సూచించారు. పాములపట్టే పోస్టుకు ఎస్టీలు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు సమావేశానికి గైర్హాజరు కావడంతో సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేశారు.. వేసవి సమీపిస్తుండటంతో గ్రామాల్లో నీటి ఎద్దడి రాకుండా జాగ్రత్తలు పడాలని సెక్రటరీలకు ఈవోపీఆర్డీ మహేశ్వర్ రెడ్డి సూచించారు. జడ్పీటీసీ దొరస్వామి, ఎంపీడీవో నీలకంఠేశ్వర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ కోదండన్, యశోదారెడ్డి, డీటీ వాణి, ఏఈలు, తులసిప్రసాద్, గురవారెడ్డి, రమేష్, ఏపీవో గుణశేఖర్‌తో పాటు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

క్రికెట్‌లో వేణుగోపాలపురం జట్టు విజేత


గెలిచిన జట్టుకు కప్ అందజేస్తున్న నిర్వాహకులు

గంగాధరనెల్లూరు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): చదువుతోపాటు క్రీడల్లో యువత రాణిస్తే ఉద్యోగాల్లో అధిక ప్రాధాన్యత లభిస్తుందని టీడీపీ యువనేత, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ వజ్రా యువరాజారెడ్డి, క్రికెట్ పోటీల నిర్వాహకులు జితేంద్రరెడ్డి, జ్ఞానేంద్రరెడ్డిలు చెప్పారు. బాలగంగనపల్లె పంచాయతీ మేనాటంపల్లెలో రెడ్డీస్ జూనియర్స్ క్రికెట్ లీగ్ ఆధ్వర్యంలో నాలుగురోజులుగా జరుగుతున్న క్రికెట్ పోటీలు ఆదివారం ముగిశాయి. పోటీల్లో 18 క్రికెట్ టీమ్‌లు తలపడ్డాయి. ఫైనల్‌లో వేణుగోపాలపురానికి చెందిన జట్టు విజయం సాధించింది. విజేత జట్టుకు కప్‌తో పాటు రూ.16వేల నగదు, బాలగంగనపల్లె టీమ్‌కు కప్‌తో పాటు రూ.10వేల నగదును నిర్వాహకులు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీనేతలు జమీర్, మహేష్, భాస్కర్, పలువురు క్రికెట్ టీమ్‌సభ్యులు పాల్గొన్నారు.

కంటి ఆపరేషన్లకు 22 మంది ఎంపిక


కంటి పరీక్షలు చేస్తున్న వైద్యురాలు హిమజ, చిత్రంలో ఎమ్మెల్యే మురళీమోహన్ తదితరులు

బంగారుపాళ్యం,మార్చి2(ఆంధ్రజ్యోతి): చెంగల్రాయనాయుడు ట్రస్ట్ ఆధ్వర్యంలో స్థానిక చెంగల్రాయనాయుడు చిల్డ్రన్స్ పార్క్‌లో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. ఎమ్మెల్యే మురళీమోహన్ హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. మండల పరిసర గ్రామాల నుంచి 110 మంది రోగులను డాక్టర్ హిమజా పరీక్షించారు. 22 మందికి ఆపరేషన్‌లు అవసరమని వైద్యులు నిర్ధారించారు. వీరికి తిరుపతిలోని అరవింద కంటి ఆసుపత్రిలో ఆపరేషనులు చేయనున్నట్లు ట్రస్టు చైర్మెన్, మాజీ ఎమ్మెల్యే వెంకటేశ్వర చౌదరి తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌పి ధరణీప్రసాద్ నాయుడు, కమలనాథరెడ్డి,రవీంద్రనాయుడు, భానుప్రకాష్, బాబురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలోకి భారీగా చేరికలు

● కండువాలు కప్పి ఆహ్వానించిన చల్లా రామచంద్రారెడ్డి


రొంపిచెర్లలో టీడీపీలో చేరిన సర్పంచులు, వైసీపీ నాయకులు

రొంపిచెర్ల, మార్చి 2: (ఆంధ్రజ్యోతి) రొంపిచెర్ల మండల వైస్ ఎంపీపీ నూలురెడ్డెప్ప, రొంపిచెర్ల, బండకిందపల్లె సర్పంచులు ఆర్. ఇబ్రహీంఖాన్, అన్వర్‌బాషా, ఎంపీటీసీలు రహీ మాబీ, మాజీ ఎంపీటీసీ సాధియా, మాజీ జడ్పీటీసీ మల్లెల చంద్రమ్మ, ఉపసర్పంచ్ శ్రీపతి లక్ష్మీదేవి, వార్డు మెంబర్లు లక్ష్మయ్య, చిన్న నాగరాజ, బావాజాన్‌లతో పాటు వారి అనుచ రులైన 50 కుటుంబాలవారు వైసీపీని వీడి ఆదివారం పుంగనూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి ఆధ్వ ర్యంలో టీడీపీలో చేరారు. వీరికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రొంపిచెర్ల పంచాయతీలో వైసీపీ యువ నాయకులు రాయచోటి హలీంఆలీఖాన్, నాషాద్, చాను, అన్వర్, మస్తాన్, అర్షాద్, శ్రీపతి, బషీర్, పెద్దమల్లెల పంచాయతీలో వైసీపీ నాయకులు ఎం.భాస్కర్‌రెడ్డి, చిన్నరెడ్డెప్ప, శ్రీనివాసులు, పాతపాళెం చెంగల్రాములు, మునిరాజ, గాలి ఉమాపతి, పించా సుధాకర్ తదితరులు పార్టీలో చేరారు. కురబ కార్పొరేషన్ డైరెక్టర్ ఉయ్యాల రమణ, మాజీ సర్పంచులు రవికుమార్‌నాయుడు, ఓబులేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

ఇంట్లో నగదు చోరీ

విజయపురం, మార్చి 2(ఆంధ్రజ్యోతి): ఆలపాకం పంచాయతీలోని ఒరూరులో తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగింది. ఎస్ఐ బలరాం కథనం మేరకు ఒరూరుకు చెందిన గిరిబాబు ఇటీవల హైదరాబాద్ వెళ్లి ఆదివారం స్వగ్రామానికి వచ్చారు. ఇంట్లో తలుపులు తెరిచి ఉండడం, అల్మారాలో వస్తువులు చిందర వందరగా ఉండడంతో చోరీ జరిగిందని గుర్తించారు. పోలీసులకు సమాచారమిచ్చారు. ఈ నెల 19న చోరీ జరిగిందని సీసీ కెమెరాలద్వారా పోలీసులు గుర్తించారు. ఇంట్లో కొద్ది మొత్తంలో నగదు చోరీ చేశారని బాధితుడు పేర్కొన్నాడు.

రైలు పట్టాలపై వ్యక్తి ఆత్మహత్య



చిత్తూరు రూరల్, మార్చి 2(ఆంధ్రజ్యోతి): రైలు పట్టాలపై తలపెట్టి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన చిత్తూరు-కాట్పాడి మార్గంలో జరిగింది. శనివారం అర్ధరాత్రి బొమ్మసముద్రం సమీపంలో ఈ ఘటన జరిగిందని చిత్తూరు రైల్వే ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. లోకోపైలెట్ ఇచ్చిన సమాచారం మేరకు ఘటనా స్థలాన్ని పరిశీలించామన్నారు. మృతిచెందిన వ్యక్తికి సుమారు 40 నుంచి 45 మధ్య వయస్సు ఉంటుందన్నారు. ఘటనను పరిశీలిస్తే ఆత్మహత్య చేసుకున్నట్లు తెలుస్తోందన్నారు.

మట్టిరోడ్డు కోతతో తరచూ ప్రమాదాలు


సీఎంసీ వద్ద కోసుకుపోయిన మట్టి రోడ్డు

గుడిపాల, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు- వేలూరు జాతీయ రహదారిలో 190 రామాపురం సీఎంసీ వద్ద రోడ్డు పక్కనే వున్న మట్టిరోడ్డు కోసుకుపోవడంతో రాత్రివేళల్లో ప్రయాణికులు గాయాలపాలవుతున్నారు. నేషనల్ హైవే అధికారుల నిర్లక్ష్యం వల్ల ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారని ప్రయాణికులు వాపోతున్నారు. నిత్యం ఈ మార్గంలో అధిక సంఖ్యలో వాహనాలు ప్రయాణిస్తుంటాయి. సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

గంగమ్మకు అభిషేకాలు



చౌడేపల్లె, మార్చి 2 (ఆంధ్ర జ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండలో గంగమ్మకు ఆదివారం అభిషేకాలు జరిగాయి. వేదపండితులు అమ్మవారిని స్వర్ణాభరణాలతో అలంకరించి దర్శనభాగ్యం కల్పించారు. ఈవో ఏకాంబరం ఏర్పాట్లను పర్యవేక్షించారు.